### మహోన్నత వ్యక్తి మన్మోహన్: నామ



మన్మోహన్‌సింగ్ మరణం పట్ల బీఆర్ఎస్ మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆయన మరణం దేశానికి తీరని లోటని తెలిపారు.

### రాష్ట్ర ఏర్పాటులో కీలకం: వినోద్



మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆర్థికశాఖ మంత్రిగా, ఆర్బీఐ గవర్నర్‌గా దేశ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటు బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడంలో కీలకభూమిక పోషించారని గుర్తుచేశారు.

### దేశాభివృద్ధిలో కీలకపాత్ర: వేముల



ప్రధానిగా మన్మోహన్‌సింగ్ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అమలుచేసి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని పేర్కొన్నారు.

### దేశానికి తీరనిలోటు: నిరంజన్‌రెడ్డి



దివంగత ప్రధాని పీవీ తెచ్చిన ఆర్థిక సంస్కరణల అమలులో మన్మోహన్ సింగ్ తన వంతు పాత్ర పోషించారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేసుకున్నారు.

### భావితరాలకు స్ఫూర్తి: బండా ప్రకాశ్



దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దిన ఆర్థిక నిపుణుడు, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ భావితరాలకు స్ఫూర్తి అని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ తెలిపారు. గతంలో రాజ్యసభ సభ్యుడిగా ఆయనతో పలు అంశాలపై చర్చించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

### అసమాన ఆర్థికవేత్త: రావుల



అసమాన ఆర్థికవేత్తను, పరిపాలన దక్షుడిని దేశం కోల్పోయిందని మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ చెప్పిన మాటలు తాను ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపారు.

### ఆర్థిక సంస్కర్త : దేవీప్రసాద్



తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ నేత కేసీఆర్‌తో కలిసి మన్మోహన్‌ను కలవడం మరువలేనిదని బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో పూర్తి సహకారం అందించారని పేర్కొన్నారు.

### గొప్ప రాజనీతిజ్ఞుడు: దాసోజు



దేశం గొప్ప రాజనీతిజ్ఞుడిని కోల్పోయిందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. మన్మోహన్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### మన్మోహన్‌కు సీఎం రేవంత్ నివాళి



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ భౌతికకాయానికి సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం ఢిల్లీలోని మన్మోహన్ సింగ్ నివాసానికి వెళ్లి భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచారు. రేవంత్ వెంట కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

### దేశానికి తీరని లోటు: కిషన్‌రెడ్డి



మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆయన నిరాడంబర జీవితం, దేశం పట్ల అంకితభావం భావితరాలకు స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు.



మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఆయనను కలిసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



ఢిల్లీలో మన్మోహన్‌సింగ్ భౌతికకాయానికి నివాళులర్పించిన తర్వాత ఆయన సతీమణిని పరామర్శిస్తున్న కేటీఆర్

# తెలంగాణ జోహార్

నేను కేంద్ర మంత్రి పదవి కోసం ఢిల్లీకి రాలేదు. నాక్కావలసింది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు. అందుకు మీరు గట్టి నిర్ణయం తీసుకోవాలి. మీరు నాకు కేటాయించిన శాఖతో తెలంగాణకు పనేలేదు. అవసరం ఉన్నవారికి, ఆ శాఖను కోరుకుంటున్నవారికి ఇవ్వండి. నాకు మాత్రం తెలంగాణ విషయంలో స్పష్టత ఇవ్వండి. నాకే శాఖ ఇవ్వకపోయినా మంచిదే..

**- మన్మోహన్‌సింగ్, సోనియాగాంధీతో కేసీఆర్ (2004)**

దేశంలో పాలనా అనుభవం ఉన్న పెద్ద రాష్ట్రాలకు పాఠాలు చెప్పే ప్రయోగశాలగా తెలంగాణ ఎదిగినందుకు సంతోషంగా ఉన్నది. తెలంగాణను కేసీఆర్ ఆ రకంగా మలిచి తన ప్రేమను నిరూపించుకున్నారు.

**- పలు సందర్భాల్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్**

మొదటిపేజీ తరువాయి...

ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ పార్లమెంటరీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎంపీలు దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర తదితర సీనియర్ నేతలు శుక్రవారం ఢిల్లీకి వెళ్లి మన్మోహన్‌సింగ్ పార్థివదేహానికి ఘనంగా నివాళులర్పించారు. మన్మోహన్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### మన్మోహన్ సహకారం మరువలేం: బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ప్రగాఢ సంతాపం తెలిపారు. 'దేశ ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్టుగా మన్మోహన్‌సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారు. ఆయనకు తెలంగాణతో ప్రత్యేక అనుబంధం ఉన్నది. వారి క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేసిన నాకు వారితో వ్యక్తిగత అనుబంధమున్నది. వారెంతో స్థితప్రజ్ఞత కలిగిన దార్శనికులు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు దాకా వారందించిన సహకారం తెలంగాణ సమాజం మరువదు. తెలంగాణ కోసం పోరాడుతున్న నాకు, టీఆర్ఎస్ పార్టీకి ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ వారు అండగా నిలిచారు. వారు ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో నాకు వారందించిన సహకారం మరువలేను. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళులర్పించాలని నిర్ణయించి వారి కడసారి వీడ్కోలు సందర్భంగా అంత్యక్రియల్లో పాల్గొనాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను, ఎంపీలను ఆదేశించిన' అని కేసీఆర్ వివరించారు.



మన్మోహన్‌సింగ్ నివాసంలో సందర్శకుల పుస్తకంలో సందేశాన్ని రాస్తున్న కేటీఆర్. చిత్రంలో ఎంపీలు సురేశ్‌రెడ్డి, వద్దిరాజు, దామోదర్‌రావు

### 2004 తొలినాళ్లలోనే..

తెలంగాణ ఉద్యమ స్వరూపం.. స్వభావాలను, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకాకుంటే ఈ ప్రాంతానికి కలిగే నష్టాలు, ఇతర పరిణామాలను కేసీఆర్ 2004 తొలినాళ్లలోనే నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు వివరించారు. 1971లో తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తామని 11 మంది తెలంగాణ ప్రజాసమితి ఎంపీలను కాంగ్రెస్‌లో విలీనం చేసుకొని ఉద్యమాన్ని అణచివేసిన చరిత్ర నాటి ప్రధాని ఇందిరాగాంధీకి ఉన్నదని, ఆ పొరపాటును మళ్లీ చేయకూడదని కేసీఆర్ పదే పదే నాటి కేంద్రాన్ని కోరారు. తెలంగాణ విషయంలో తాము చేసిన తప్పును మన్మోహన్ సరిదిద్దారని తెలంగాణ ఏర్పాటు తొలినాళ్లల్లో అనేక మంది కాంగ్రెస్ నేతలు సైతం బహిరంగంగా చెప్పిన సందర్భాలున్నాయి.

### కేసీఆర్ సంకల్పానికి ముగ్ధుడైన మన్మోహన్

దశాబ్దాలుగా తెలంగాణపై కొనసాగిన అణచివేత, ఆర్థిక దోపిడీ, సామాజిక, సాంస్కృతిక వివక్ష తెలిసిన అతికొద్ది మంది జాతీయ నాయకుల్లో మన్మోహన్ సింగ్ ముందు వరుసలో ఉంటారు. 2004లో టీఆర్ఎస్‌తో పొత్తు ఫలితంగా ఇటు రాష్ట్రంలో ఇటు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. పార్టీ అధినేత కేసీఆర్, ఆలె నరేంద్ర, బోయినపల్లి వినోద్‌కుమార్, రవీంద్రనాయక్, మధుసూదన్‌రెడ్డి ఐదుగురు ఎంపీలుగా గెలిచారు. పొత్తులో భాగంగా బీఆర్ఎస్‌కు రెండు కేంద్ర మంత్రి పదవులు వచ్చాయి. కేసీఆర్‌కు షిప్పింగ్, ఆలె నరేంద్రకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖలు దక్కాయి. నాటి యూపీఏ మిత్రపక్షమైన డీఎంకే షిప్పింగ్ మంత్రిత్వశాఖ కావాలని పట్టుబట్టింది. కేసీఆర్‌కు ముందుగా కేటాయించిన షిప్పింగ్ శాఖను ఎలా తీసుకోవడమన్న మీమాంసలో కేంద్రం పడింది. 'ఈ విషయాన్ని కేసీఆర్‌కు ఎలా చేరవేయాలి? పొత్తు ధర్మంలో భాగంగా కేటాయించిన శాఖను తిరిగి ఇవ్వాలని ఎలా అడగాలి' అన్న సందిగ్ధంలో కేంద్ర ప్రభుత్వం ఉన్నదనే విషయం తెలుసుకున్న కేసీఆర్ తానే స్వయంగా మన్మోహన్ సింగ్, సోనియాగాంధీ వద్దకు వెళ్లి 'నేను కేంద్ర మంత్రి పదవి కోసం ఢిల్లీకి రాలేదు. నాక్కావాల్సింది తెలంగాణ ఏర్పాటు. అందుకు మీరు గట్టి నిర్ణయం తీసుకోవాలి. మీరు నాకు కేటాయించిన శాఖతో తెలంగాణకు పనేలేదు. అవసరం ఉన్నవారికి, ఆ శాఖను కోరుకుంటున్నవారికి ఇవ్వండి. నాకు మాత్రం తెలంగాణ విషయంలో స్పష్టత ఇవ్వండి. నాకు ఏ శాఖా కూడా ఇవ్వకపోయినా మంచిదే' అని కేసీఆర్ చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అప్పుడు కేసీఆర్‌కు కేటాయించిన శాఖను డీఎంకేకు ఇవ్వడంతో చాలా కాలం కేసీఆర్ ఏ శాఖ కూడా లేని మంత్రిగా కొనసాగిన విషయం తెలిసిందే. యూపీఏ కనీస ఉమ్మడి ప్రణాళికలో తెలంగాణకు చోటు, జూన్ 7, 2004లో పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగంలో తెలంగాణ అంశాన్ని చేర్చడం, ఆ తర్వాత జూలైలో విజ్ఞానభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కేంద్రం కట్టుబడి ఉన్నదని ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించడం దాకా ప్రతి సందర్భంలో కేసీఆర్‌లో ఉన్న సంకల్పానికి మన్మోహన్‌సింగ్ ముగ్ధులయ్యారు.

### తెలంగాణతో మన్మోహన్‌కు వీడదీయలేని అనుబంధం

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు తెలంగాణతో విడదీయరాని అనుబంధం ఉన్నది. ఉమ్మడి వరంగల్ జిల్లా ఏటూరునాగారం మండలం కంతనపల్లి గ్రామం గోదావరి వరద ముంపునకు గురైనప్పుడు 1987, ఏప్రిల్ 24న నాటి ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా ఉన్న మన్మోహన్‌సింగ్ ఆ గ్రామానికి వచ్చి వరద బాధితుల కోసం నిర్మించిన కంతనపల్లి పునరావాస కాలనీని ప్రారంభించారు. ఆ గ్రామంలో ఇప్పటికీ ఆయన ప్రారంభించిన శిలాఫలకం ఉన్నది. కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ జయశంకర్ ఉన్న సమయంలో 1992లో వర్సిటీ స్నాతకోత్సవంలో మన్మోహన్‌సింగ్ 'యు టర్న్ ఇన్ ఇండియన్ ఎకానమీ' అనే అంశంపై స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. 2003లో వరంగల్‌లో టీఆర్ఎస్ నిర్వహించిన తెలంగాణ జైత్రయాత్ర బహిరంగ సభ ద్వారా బలంగా ప్రజ్వరిల్లిన తెలంగాణ ఆకాంక్ష, జాతీయ రాజకీయాలను ఆకర్షించింది. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా తెలంగాణ ప్రాంతమంతా అప్రతిహత చైతన్యస్రవంతిని విస్తరింపజేస్తున్న టీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోక తప్పని అనివార్యతను కేసీఆర్ సృష్టించారు. అప్పటి నుంచి 2014లో తెలంగాణ రాష్ట్ర కల సాకారమయ్యేదాకా మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉండటం విశేషం.

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన మంత్రివర్గ సహచరుడే అయినా మన్మోహన్ ఆప్యాయంగా 'చంద్రశేఖర్‌జీ' అని సంబోధించేవారు.
- 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో', 'తెలంగాణ జైత్రయాత్రో.. కేసీఆర్ శవయాత్రో' అంటూ 2009 నవంబర్ 29న చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షకు మన్మోహన్‌సింగ్ చలించిపోయారు.
- డిసెంబర్ 9 ప్రకటనను త్రిమూర్తుల కూర్పుగా చెప్తుంటారు. రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసింది నాటి హోంమంత్రి చిదంబరమే అయినా కేసీఆర్‌కు, మన్మోహన్ సింగ్‌కు మధ్య వారధిగా ప్రొఫెసర్ జయశంకర్ ఉన్నారు. ఈ ముగ్గురి 'పద'కూర్పే తెలంగాణ రాష్ట్ర ప్రకటన.
- 2014, ఫిబ్రవరి 19న పార్లమెంట్‌లోకి బిల్లు వచ్చేదాకా మన్మోహన్‌సింగ్, కేసీఆర్ అత్యంత గోప్యంగా వ్యవహరించారు.
- పార్లమెంట్ ఫ్లోర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బిల్లు సమయంలో అనుసరించాల్సిన వ్యూహంపై మన్మోహన్, కేసీఆర్ ముందుగా చర్చించుకొని, ఆ పర్యవసానాల నేపథ్యంగా పార్లమెంట్ ఉభయ సభల్లో నాడు ప్రతిపక్షనేతలుగా ఉన్న అరుణ్‌జైట్లీ, సుష్మా మద్దతును కేసీఆర్ కూడగట్టడంతో ఇద్దరి వ్యూహం ఫలించిందని చెప్తారు.
- తెలంగాణ బిల్లు ఉభయ సభల్లో నెగ్గి రాష్ట్రపతి ఆమోదం పొందేదాకా మన్మోహన్ సింగ్ తెలంగాణ ఏర్పాటు విషయంలో కేసీఆర్‌కు బాసటగా నిలిచారు.
- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన విప్లవాత్మక పథకాల ఫలితాలను చూసి మన్మోహన్ సింగ్ ఎంతో ముచ్చటపడ్డారు.
- రాజ్యసభ సభ్యుడిగా రైతుబంధు, వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్తు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలను మన్మోహన్ కీర్తించారు. 'దేశంలో పాలనా అనుభవం ఉన్న పెద్ద రాష్ట్రాలకు పాఠాలు చెప్పే ప్రయోగశాలగా ఎదిగినందుకు సంతోషంగా ఉన్నది. తెలంగాణను కేసీఆర్ ఆ రకంగా మలిచి తన ప్రేమ ను నిరూపించుకున్నారు' అని పలు సందర్భాల్లో మన ఎంపీలతో పేర్కొనటం గమనార్హం.

# వెన్నుతట్టి ప్రోత్సహించారు

- ఉద్యమంలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా ఆత్మస్థైర్యం కోల్పోవద్దని చెప్పారు
- రాష్ట్రం ఏర్పడ్డాక ఎప్పుడూ వాకబు చేసేవారు
- దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన మేధావి మన్మోహన్ : ఢిల్లీలో కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని నాడు వెన్నుతట్టి తెలంగాణ ఉద్యమాన్ని ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి డాక్టర్ మన్మోహన్ సింగ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మననం చేసుకున్నారు. 'మీ డిమాండ్, కోరికలో న్యాయం ఉన్నది. మీ ఆశయం తప్పక ఫలిస్తుంది' అని ప్రత్యేక రాష్ట్రాన్ని కాంక్షించిన నాయకుడు మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. శుక్రవారం ఢిల్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కేఆర్ సురేశ్‌రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, విప్ దీవకొండ దామోదర్ రావు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'కేసీఆర్‌కు మన్మోహన్ సింగ్‌తో చాలా సాన్నిహిత్యం ఉండేది. ఏడాదిన్నర పాటు వారి క్యాబినెట్‌లో కేసీఆర్ కేంద్ర మంత్రిగా పనిచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఎన్నో సందర్భాల్లో చాలా ఆప్యాయంగా పలకరించేవారు. తెలంగాణ ఎలా ఉన్నదని ఎప్పటికప్పుడు వాకబు చేసేవారు. ఎన్నో విషయాల్లో కేసీఆర్‌కు ఆయన దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ఏర్పాటు కోసం 2004లో కేసీఆర్ ఆయన క్యాబినెట్‌లో చేరిన తర్వాత.. కొన్ని ఒడిదొడుకులు ఎదురైనా కూడా 'మీరు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దు' అంటూ వెన్నుతట్టి ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నారు. 'మీ డిమాండ్, కోరికలో న్యాయం ఉన్నది. మీ ఆశయం ఫలిస్తుంది. ఫలించాలి అని తెలంగాణను కాంక్షించిన నాయకుడు మన్మోహన్ సింగ్. భారత దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేటమే కాకుండా.. మన దేశానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారు. ఒక సౌమ్యుడిగా, వివాదరహితుడిగా, అందరివాడుగా భారత దేశానికి గొప్ప పేరు తెచ్చిన నాయకుడు డాక్టర్ మన్మోహన్ సింగ్' అని కొనియాడారు. 'ఆయనకు మా పార్టీ తరపున నివాళి అర్పించాలని పార్టీ పెద్దలు కేసీఆర్ చెప్పారు. రాజ్యసభ ఫ్లోర్ లీడర్ సురేశ్‌రెడ్డి, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ తదితరులతో కలిసి వారి కుటుంబసభ్యులను కలిశాం. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించాం. ఇలాంటి మహానుభావుడిని కోల్పోవడం దురదృష్టకరం. దేశంలో అధికారం మారుతూ ఉండొచ్చు.. కానీ దేశం మంచిగా ఉండాలని కాంక్షించే వారు చనిపోవడం అత్యంత బాధాకరం. వారి కుటుంబానికి దేవుడు మనో నిబ్బరం కలుగజేయాలని మా ప్రార్థన. వారి మృతిపట్ల మా బీఆర్ఎస్ పార్టీ సంతాపం, సానుభూతి తెలియజేస్తున్నది' అని పేర్కొన్నారు.

### రెస్ట్ ఇన్ పీస్ సర్..

'నవ భారత నిర్మాత, దార్శనికుడు, అసలైన మేధావి, దయాహృదయుడు మన్మోహన్ సింగ్ పట్ల చరిత్ర దయ, కృతజ్ఞతతో ఉంటుంది. మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఆయన స్నేహితులు, కుటుంబానికి నా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నా. ఆయన గొప్పదనం రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తుంది. రెస్ట్ ఇన్ పీస్ సర్' అంటూ 'ఎక్స్'లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

# కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ భారీ ఆశలు

- రాష్ట్రానికి 1.63 లక్షల కోట్ల రూపాయలు కేటాయించండి
- ట్రిపుల్ ఆర్‌కు 34,367 కోట్లు.. మెట్రో రెండోదశకు 24,269 కోట్లు.. మూసీ కోసం14,100 కోట్లు ఇవ్వండి
- పెండింగ్ గ్రాంట్లు ఇవ్వండి
- 4 విమానాశ్రయాలకు అనుమతివ్వండి
- కేంద్రానికి రాష్ట్రం ప్రతిపాదనలు
- ఇప్పటికే కేంద్ర మంత్రులకు వినతి

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం భారీ ఆశలు పెట్టుకున్నది. గతంలో బడ్జెట్ కేటాయింపుల విషయంలో తెలంగాణకు కేంద్రం తీవ్ర అన్యాయం చేసింది. అయితే, వచ్చే ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం చాలా అంచనాలు పెట్టుకున్నది. కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనల్లో రాష్ట్రానికి రూ.1.63 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతున్నది. రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ, మూసీ నది అభివృద్ధితోపాటు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆర్థికసహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క, సంబంధిత శాఖల మంత్రులు ఈ అంశాలపై కేంద్ర మంత్రులకు ఇప్పటికే ప్రతిపాదనలు సమర్పించారు.

### ట్రిపుల్‌ఆర్‌కు ప్రాధాన్యం




హైదరాబాద్‌కు రీజినల్ రింగ్ రోడ్డు, పరిశ్రమల వృద్ధి, లాజిస్టికల్ హబ్స్, ఫార్మాసిటీ ప్రాధాన్య అంశాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకుంటున్నది. ఇందు కోసం కేంద్రం నుంచి రూ.34,367 కోట్ల సాయం కోరింది. భూసేకరణ మొదలుపెట్టినప్పటికీ, కేంద్ర నుంచి అవసరమైన అనుమతుల కోసం ఎదురుచూస్తున్నది. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ రెండో దశ 76.4 కిలోమీటర్ల పరిధిని కవర్ చేయనున్నది. కేంద్రం, రాష్ట్ర నిధులతో దీనిని నిర్మించాలనే ప్రతిపాదన ఉన్నది. ఇందుకు కేంద్ర వాటాగా రూ.24,269 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తిచేసింది. తెలంగాణ నుంచి మూసీ నది పునర్జీవన ప్రాజెక్ట్ మరో ముఖ్యమైన ప్రతిపాదన ఉన్నది. ఈ ప్రాజెక్ట్ కోసం మూసీ సమీపంలోని 220 ఎకరాల రక్షణశాఖకు చెందిన భూమిని ఇవ్వాలని రాష్ట్ర సర్కారు కోరింది. ఈ ప్రాజెక్టుకు రూ.14,100 కోట్ల నిధులు అవసరమవుతాయని, సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

### ఏపీ బకాయిలు 2,547.07 కోట్లు ఇప్పించండి

కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.1,800 కోట్ల గ్రాంట్లను విడుదల చేయాలని కోరింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద ఏపీ నుంచి రావాల్సిన నిధులు, రాష్ట్రం మీద పడిన రూ.2,547.07 కోట్ల అప్పులు ఇప్పించాలని కోరింది. 2014-15 కేంద్ర ప్రాయోజిత పథకాల కింద తెలంగాణకు కేటాయించాల్సిన రూ.495.20 కోట్ల బకాయిలను పరిష్కరించడంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని అభ్యర్థించింది. కాజీపేటలో సమగ్ర కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం వంటి పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్రం డిమాండ్ చేస్తున్నది. రైల్వే కనెక్టివిటీ మరింత మెరుగుపర్చాలని కోరుతున్నది. వరంగల్ జిల్లా మామునూరు, ఖమ్మం జిల్లా పాల్వంచ, పెద్దపల్లి జిల్లా అంతర్గావ్, ఆదిలాబాద్‌లోనూ కొత్త విమానాశ్రయాల ఏర్పాటు కోసం అనుమతులు ఇవ్వాలని ప్రతిపాదనలు సమర్పించింది. ఇలా మొత్తం కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనల్లో రాష్ట్రానికి రూ.1.63 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది.


భారత ప్రభుత్వం
రక్షణ మంత్రిత్వ శాఖ

డిఫెన్స్ రిసెర్చ్ & డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO)
సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (CAS)
యాద్గార్‌పల్లి (గ్రా), కీసర (మం), హైదరాబాద్-501303.
ముగింపు తేదీ: ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో ప్రచురణ తేది నుండి 15 రోజులు

ADV No.CAS/ADMIN/MD/2024/01, తేది: 13 డిసెంబర్ 2024
మెడికల్ డాక్టర్ ఉద్యోగం (కాంట్రాక్ట్ ప్రాతిపదికన) కొరకు అర్హతగల డాక్టర్ల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

| | | | |
|---|---|---|---|
| 1 | ఉద్యోగం పేరు | : | మెడికల్ డాక్టర్ (కాంట్రాక్ట్ ప్రాతిపదికన) |
| 2 | ఉద్యోగాల సంఖ్య | : | ఒకటి (01) |
| 3 | జీతం | : | నెలకు రూ.75,000/- (కన్సాలిడేటెడ్/ఫిక్స్‌డ్) |
| 4 | వయస్సు | : | ముగింపు తేదీనాటికి 69 సంవత్సరాలకు మించకూడదు |
| 5 | అర్హత/ విద్యార్హతలు | : | MBBS (అల్లోపతి) మరియు కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వ/PSUs నుండి రిటైర్డ్ అయి ఉండాలి (లేదా) MBBS (అల్లోపతి) మరియు MBBS తర్వాత మెడికల్ ప్రాక్టీస్‌లో కనీసం 05 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి (లేదా) MD (జనరల్ మెడిసిన్/ కమ్యూనిటీ మెడిసిన్/ ఇంటర్నల్ మెడిసిన్/ ఎమర్జెన్సీ మెడిసిన్/ జీరియాట్రిక్ మెడిసిన్/పీడియాట్రిక్ మెడిసిన్/ రెస్పిరేటరీ మెడిసిన్)తో సహా MBBS |
| | | | హైదరాబాద్ నుండి ప్రధానంగా ఇంగ్లీష్/హిందీ/తెలుగు భాషలు ధారాళంగా మాట్లాడవలెను |

నియమ నిబంధనలు
a) ఉద్యోగం పూర్తిగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉంటుంది.
b) NPA మరియు ఇతర అలవెన్సులు ఉండవు.
c) నియామక కాలవ్యవధి నియామక తేదీనుండి ఒక సంవత్సరం లేదా CAS రెగ్యులర్ ఉద్యోగ పోస్టింగ్ వరకు ఏది ముందు అయితే అది.
d) సదరు ఉద్యోగం కొరకు ఎంపికైన మెడికల్ డాక్టర్ సీనియారిటీ లేదా తర్వాత స్టేజ్ వద్ద రెగ్యులర్ గవర్నమెంట్ సర్వీస్ కొరకు ఎంపికైతే ఏదేని ఇతర ప్రయోజనాలు వర్తించవు.
e) నియామకం DRDO హెడ్‌క్వార్టర్స్, న్యూఢిల్లీ ఆమోదంకు లోబడి ఉంటుంది.
f) పని వేళలు (సెలవురోజులు మినహా)- సోమవారం నుండి శుక్రవారం - 9.00 గం.నుండి 17.30 గం.వరకు శనివారం/ఆదివారం (ఎమర్జెన్సీ లేదా కాల్ చేసినచో)

2. అర్హతగల అభ్యర్థులు పేరు, తండ్రి/భర్త పేరు, పుట్టిన తేదీ, ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా, విద్యార్హతలు, అనుభవం వివరాలు, ఫోన్ నెంబర్, ఇమెయిల్ చిరునామాను తెలియజేస్తూ ప్లెయిన్ పేపర్‌పై టైప్ చేసిన వ్రాతపూర్వక దరఖాస్తులను దాఖలు చేయవలెను మరియు అన్ని సర్టిఫికెట్లు /టెస్టిమోనియల్స్ ఫోటోకాపీలు మరియు రెండు ఇటీవలె పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్‌లను ఈ ప్రకటన తేది నుండి 15 రోజులలోగా డైరెక్టర్, సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (CAS), యాద్గార్‌పల్లి (గ్రా), కీసర (మం), హైదరాబాద్-501303, తెలంగాణ (S)కి పంపవలెను. ఎన్వలప్‌పై "APPLICATION FOR THE POST OF MEDICAL DOCTOR (ON CONTRACT BASIS) అని వ్రాయవలెను.
3. ఏ కారణాలు తెలియజేయకుండా ఏదేని దరఖాస్తును అనుమతించు/తిరస్కరించు హక్కు సంస్థకు కలదు.

సం/- (డా.ఎల్. శ్రీ వర్ధన్) సైంటిస్ట్ 'F'
DOMS డైరెక్టర్, CAS తరపున

దరఖాస్తు నమూనా
ప్రకటన నం. ........................ తేది: ........................
ఫోటోగ్రాఫ్
1. దరఖాస్తుచేసిన పోస్ట్ :
2. పేరు (పూర్తిగా) :
3. తండ్రి/భర్త పేరు :
4. పుట్టిన తేదీ :
5. సంప్రదింపుల కొరకు చిరునామా :
6. శాశ్వత చిరునామా :
7. మొబైల్ నం. :
8. ఇమెయిల్ ఐడి :
9. విద్యార్హతలు (వాటి కాపీలను జతచేయవలెను)

| అర్హత | ఇన్‌స్టిట్యూషన్/ విశ్వవిద్యాలయం | ఉత్తీర్ణత సంవత్సరం | సబ్జెక్టులు | మార్కుల శాతం |
|---|---|---|---|---|
| | | | | |

10. అనుభవం (వాటి కాపీలను జత చేయాలి)
11. ఏదైనా ఇతర సమాచారం
పైన తెలిపిన వివరాలు సరైనవని నేను ధృవీకరిస్తున్నాను.
తేది: సం/-
ప్రదేశం:
cbc-10301/11/0140/2425